క్లుప్తంగా

యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా అహ్మద్



నియామక పత్రం అందజేస్తున్న జిల్లా అధ్యక్షుడు మహ్మద్ అవైజ్‌చిస్తీ

భువనగిరిటౌన్ : పట్టణానికి చెందిన మహ్మద్ అహ్మద్ యువజన కాంగ్రెస్ భువనగిరి నియోజకవర్గ ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ మేరకు యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మహ్మద్‌అవైజ్‌చిస్తీ శనివారం ఉత్తర్వులు జారీ చేసి నియామక పత్రం అందజేశారు. అనంతరం అహ్మద్ మాట్లాడారు. యువజన కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

కుటుంబానికి పరామర్శ

భువనగిరిరూరల్ : మండలంలోని పచ్చర్లబోడుతండా గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ కేదారి సతీమణి మృతి చెందింది. ఆదివారం జెడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి మృతదేహాన్ని సందర్శించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట స్థానిక సర్పంచ్ రెడ్డి నాయక్, ఆకుతోటబాయితండా సర్పంచ్ సుధాకర్, బీఆర్ఎస్ నాయకులు ఎండీ సాజిత్, డొప్ప వెంకటేష్, యాట కుమార్, ఎండీ మోహిన్, ఎండీ అతిక్, గోపి, నరేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జేపీ నడ్డా జన్మదిన వేడుకలు



జన్మదిన వేడుకల్లో పాల్గొన్న బీజేపీ నాయకులు

మోటకొండూర్ : మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు జగత్‌ప్రకాష్ నడ్డా జన్మదిన వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి పీసరి తిరుమలరెడ్డి, కిసాన్ మోర్చ మండల అధ్యక్షుడు అనంతుల పాండురంగారెడ్డి, చిర్ర రవీందర్, మల్గ అశోక్, మల్గ నవీన్ తదితరులు ఉన్నారు.

వీరేశంను కలిసిన కాంగ్రెస్ నాయకులు

చౌటుప్పల్ : నకిరేకల్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి వేముల వీరేశంను శనివారం మండలానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు నకిరేకల్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనను కలిసిన వారిలో మదర్ డెయిరీ మాజీ చైర్మన్ గంగుల కృష్ణారెడ్డి, డీసీసీబీ మాజీ డైరెక్టర్ పిల్లమర్రి శ్రీనివాస్ ఉన్నారు. ఈ సందర్భంగా ఆయనను పూలమాల, శాలువాలతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు.

'చలో ఢిల్లీ'ని జయప్రదం చేయాలి

భువనగిరిటౌన్ : రాజ్యాంగం, రిజర్వేషన్లు, ప్రభుత్వ రంగ సంస్థల రక్షణ, ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్ల అమలుకై ఈనెల 4న నిర్వహించనున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం కౌన్సిల్ సభ్యుడు కొండమడుగు నర్సింహ పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలో నిర్వహించిన వ్యవసాయ కార్మిక సంఘం, కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. డిసెంబర్ 4న నిర్వహిస్తున్న చలో ఢిల్లీ కార్యక్రమంలో పెద్దఎత్తున ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా అధ్యక్షుడు అన్నంపట్ల కృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు కొండాపురం యాదగిరి, బొల్లెపల్లి కిషన్, సిలివేరి ఎల్లయ్య, బొడ్డు కిషన్, నాయకులు కృష్ణ, పరమేష్, లక్ష్మీనారాయణ, బాలయ్య, ఊశయ్య, చంద్రమౌళి తదితరులు ఉన్నారు.

రాష్ట్రంలో కాంగ్రెస్‌దే అధికారం

ఆత్మకూరు(ఎం) : రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధిక సీట్లు సాధించి అధికారం చేపడుతుందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యాస లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి బీర్ల అయిలయ్య ఎమ్మెల్యేగా గెలుపొందుతారన్నారు. ఆయన వెంట ఎంపీపీ తండ మంగమ్మశ్రీశైలం, జెడ్పీటీసీ కొడిత్యాల నరేందర్ గుప్తా, పీఏసీఎస్ చైర్మన్ జిల్లాల శేఖర్‌రెడ్డి, సర్పంచ్ జన్నాయికోడె నగేష్, ఉపసర్పంచ్ దొంతరబోయిన నవ్య ఉన్నారు.

జూనూతుల గట్టుకు హనుమాన్ భక్తుల తాకిడి

గుర్రంపోడు : నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండలంలోని జూనూతుల గట్టుపై ఆంజనేయస్వామి విగ్రహాలు ఇటీవల బయటపడటంతో భక్తులు పెద్ద సంఖ్యలో పోటెత్తుతున్నారు. గట్టుపై అంజనేయస్వామి ఆలయాన్ని నిర్మించాలని భక్తులు కోరుతున్నారు.

నిలపని బస్సులు.. తప్పని ఇక్కట్లు

- బీబీనగర్ జాతీయ రహదారి స్టాప్‌లో ఆగని ఆర్టీసీ బస్సులు
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు, విద్యార్థులు
- ప్రత్యేకంగా ఆర్డినరీ సర్వీసులు కేటాయించాలని వేడుకోలు



బీబీనగర్‌లో హైదరాబాద్ వైపు వెళ్లే బస్సుల కోసం ఎదురుచూస్తున్న విద్యార్థులు, ప్రయాణికులు

బీబీనగర్ : జాతీయ రహదారులపై బస్టాప్‌లు ఏర్పాటు చేసినా ఆయా స్టాప్‌ల్లో ఆర్టీసీ సిబ్బంది బస్సులు నిలపడం లేదు. దీంతో హైదరాబాద్, ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు విద్యార్థులు, ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. బీబీనగర్ మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై ఆర్టీసీ బస్సులు నిలపకపోవడంతో దిక్కుతోచని స్థితిలో ఒక వైపు విద్యార్థులు మరో వైపు ప్రయాణికులు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారు. ఎక్కువ డబ్బులను చెల్లించి ప్రయాణం చేస్తున్నారు. బీబీనగర్ మండల కేంద్రంతో పాటు సుమారు 30కిపైగా గ్రామాల నుంచి విద్యార్థులు, ప్రజలు ప్రతిరోజు 200మందికి పైగా బీబీనగర్ జాతీయ రహదారిపై గల బస్‌స్టాప్‌లకు చేరుకొని ప్రయాణిస్తున్నారు. కాని వారికి అనుగుణంగా బస్సులు లేక, వచ్చిన బస్సులు ఆపకపోవడంతో నానా తిప్పలు పడుతున్నారు.

గంటల కొద్ది వేచివుండాల్సిందే..

ఉదయం 6గంటల నుంచి 9గంటల వరకు వివిధ గ్రామాల నుంచి విద్యార్థులు ఘట్‌కేసర్, ఉప్పల్, హబ్సిగూడ, తదితర ప్రాంతాల్లోని తమ కళాశాలకు వెళ్లేందుకు మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై ఉన్న బస్‌స్టాప్‌కు చేరుకుంటారు. అలాగే భువగిరిలోని కళాశాలలకు వెళ్లడానికి విద్యార్థులు అటు వైపు బస్టాప్‌కు చేరుకుంటారు. కాని హైదరాబాద్ వైపు వెళ్లే బస్సులు భువనగిరి వైపు నుంచే ఫుల్‌గా వస్తుండడం, ఎక్కువగా ఎక్స్‌ప్రెస్‌లు వస్తుండడంతో మండల కేంద్రంలో బస్సులు నిలపడం లేదు. దీంతో విద్యార్థులు ఖాళీగా వచ్చే బస్సుల కోసం గంటకు పైగా వేచి వుండాల్సి వస్తుంది. బస్సుల కొరత ఉండడంతో పాటు ఆర్డినరీ సర్వీసులు తక్కువగా, ఎక్స్‌ప్రెస్ సర్వీసులు ఎకు క్కవగా వస్తుండడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం ఉన్న ఆర్డినరీ సర్వీ సులు సమయానికి రాకపోవడంతో, వచ్చినా స్థానిక స్టాప్‌లో నిలపకపోవడంతో విద్యార్థులు కళాశాలలకు సమయానికి చేరుకోలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు స్పందించి మండల కేంద్రం నుంచి హైదరాబాద్‌కు ఆర్డినరీ బస్సు సర్వీసులను కేటాయించి, వాటి సంఖ్యను పెంచాలని, అలాగే స్థానిక స్టాప్‌లో ప్రతి బస్సును నిలిపేలా చూడాలని స్థానిక ప్రయాణికులు, విద్యార్థులు కోరుతున్నారు.

బస్సులు నిలపడం లేదు



ఉదయం 6–7గంటల సమయంలో విద్యార్థులు కళాశాలలకు వెళ్లడానికి బస్సుల కోసం రోడ్డుపై గంటకు పైగా వేచిఉంటున్నారు. బస్సులు భువనగిరి వైపు నుంచి హైదరాబాద్‌కు రద్దీగా వస్తుండడంతో ఇక్కడ నిలపడం లేదు. బస్సుల సంఖ్యను పెంచడంతో పాటు ఎక్స్‌ప్రెస్ బస్సులకు బీబీనగర్‌లో స్టాప్‌లో నిలిపేలా చూడాలి, అదే విధంగా ప్రత్యేకంగా మండల కేంద్రం నుంచి సర్వీసులు నడిపేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– అస్గర్ అలీ, బీబీనగర్

అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై జోరుగా చర్చ

- ఆలేరులో ఆయా పార్టీల నాయకులు తామే గెలుస్తామంటూ ధీమా
- నేడు తేలనున్న అభ్యర్థుల భవితవ్యం



యాదగిరిగుట్ట : ఆలేరు నియోజకవర్గంలో ఎక్కడ నలుగురు కలిసినా.. ఏ గ్రామంలోనైనా.. తండాలోనైనా ఒకటే చర్చా.. ఏ పార్టీ గెలుస్తుంది.. ఎవరు ఎమ్మెల్యే అయితారనేదే. 40రోజులుగా విస్తృతంగా ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు 30న పోలింగ్ అయ్యాక కొద్దిగా విశ్రాంతి తీసుకున్నారు. ఆదివారం ఓట్లను లెక్కించే ప్రక్రియ ఉండటంతో శనివారం ఎక్కడ చూసినా.. ఎవరు కలిసినా గెలుపు, ఓటములపై చర్చలు చేసుకోవడంతో పాటు మెజార్టీ ఏపార్టీకి ఎంత వస్తుందనే అంశాలను ప్రసావిస్తున్నారు. ఆలేరు నియోజకవర్గంతో పాటు పక్కనే ఉన్న భువనగిరి, జనగాం నియోజకవర్గాల ప్రజలు సైతం ఆలేరు అసెంబ్లీ స్థానం గురించే ఎక్కువగా చర్చించుకుంటున్నారు.

నియోజకవర్గంలో ఇలా..

ఆలేరు నియోజకవర్గంలో 2,33,266 ఓట్లు ఉండగా 2,11,744 ఓట్లు పోలయ్యాయి. 90.77శాతం ఓట్లు పోలవ్వడంతో ఏ పార్టీకి మెజార్టీ వస్తుందోనని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఇప్పటికే కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన కార్యకర్తలు, నాయకులు తమ అభ్యర్థులతో ఓటింగ్ సరళిపై కలిసి వివరించారు. అయినప్పటికీ ఈవీఎంలో గెలుపు, ఓటములు ఉండటంతో అటు అభ్యర్థుల్లో.. ఇటు కార్యకర్తలు, నాయకుల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది.

కొందరికి ధైర్యం.. ఇంకొందరికి భయం..

అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఇటీవల కాలంలో బీఆర్ఎస్‌లో ఉన్న సర్పంచ్‌లు, ముఖ్యమైన నాయకులు కాంగ్రెస్‌లోకి, కాంగ్రెస్‌లో ఉన్న సర్పంచ్‌లు, ముఖ్యమైన నాయకులు బీఆర్ఎస్‌లోకి చేరారు. ఇప్పుడు ఏ పార్టీ గెలుస్తుంది.. ఏ పార్టీ ఓడుతుందనే ఆలోచనలో ఆయా పార్టీలో చేరిన వారు ఆలోచనలు చేస్తున్నారు. కాంగ్రెస్‌ను కాదని బీఆర్ఎస్‌లోకి.. బీఆర్ఎస్‌ను కాదని కాంగ్రెస్‌లో చేరిన వారు ఆందోళనలు చెందుతున్నారు. ఏ పార్టీ గెలిచినా మరో పార్టీలో ఉన్న వారి విలువలు, ఆధిపత్యం పెరగడంతో పాటు ఓడిన పార్టీలో చేరిన నాయకులు తమ ప్రతాపాన్ని గ్రామాల్లో, మండలాల్లో కోల్పోవాల్సి వస్తుందని భయపడుతున్నారు. మరో వైపు కష్టపడి ఆయా పార్టీల కోసం పనిచేసిన కార్యకర్తలు, నాయకులు గెలిస్తే సంబరాలు చేసుకునేందుకు.. ఓడిపోతే ఆ బాధను తట్టుకోలేక మనశాంతి కోసం ఆలయాలకు వెళ్లేందుకు ఇప్పటికే సిద్ధమైనట్లు స్థానికంగా చర్చలు సాగుతున్నాయి.

వైభవంగా రాధాకృష్ణుల కల్యాణ మహోత్సవం



తాళిబొట్లు చూపిస్తున్న అర్చకుడు

తుర్కపల్లి : మండలంలోని వాసాలమర్రి గ్రామపరిధిలో గల రాంశెట్టిపల్లిలో రాధాకృష్ణుల కల్యాణం శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కల్యాణోత్సవాన్ని భావనంద రాధాకృష్ణ మఠం ఆధ్వర్యంలో వేదమంత్రోచరణలతో నిర్వహించారు. అనంతరం భక్తులు కల్యాణమూర్తులను దర్శించుకొని, ఒడిబియ్యాలు పోసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం మహా ఆశీర్వచనం, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో నిర్వాహకులు గట్టు బాలయ్య, గట్టు రాజయ్య, గట్టు వెంకటేశం, సర్పంచ్ పోగుల ఆంజనేయులు, పాండురంగ ఆశ్రమ నిర్వాహకులు అప్పాల సత్యనారాయణశర్మ, విఠల్ శర్మ, రసరాజు శర్మ, గోపాలశర్మ, భవనంద శర్మ, మాజీ సర్పంచ్ బాలరాజు, రంగ శంకరయ్య, సుంకరి శెట్టయ్య, పలుగుల శ్రీనివాస్, కందుకూరి అమర్‌నాథ్ గ్రామస్తులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ గెలవడం ఖాయం

ఆలేరురూరల్ : బీఆర్ఎస్ పార్టీ అధిక మెజార్టీతో గెలుస్తుందని ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు పుట్ట మల్లేషం అన్నారు. శనివారం పట్టణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కేసీఆర్, ఆలేరులో గొంగిడి సునీత గెలుపొందడం ఖాయమని ఆశాభావం వ్యక్తం చేశారు. కొలనుపాకలో డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డిపై కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు గుండాల్లా ప్రవర్తించారన్నారు. గొంగిడి మహేందర్‌రెడ్డిపై దాడి చేయడం హేయమైన చర్య అన్నారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ దాసి సంతోష్, పట్టణ మాజీ అధ్యక్షుడు మొరిగాడి వెంకటేష్, బేతి రాములు, పత్తి వెంకటేష్, దయ్యాల సంపత్, ఉప్పలయ్య, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గొంగిడి సునీతదే గెలుపు..

బొమ్మలరామారం : ఆలేరు బీఆర్ఎస్ అభ్యర్థి గొంగిడి సునీత గెలుపు ఖాయమని ఆ పార్టీ మండల నాయకుడు జూపల్లి భరత్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సునీత గెలుపును అన్ని వర్గాల ప్రజలు కోరుకుంటూ ఓట్లు వేశారన్నారు. ఆయన వెంట కట్టా శ్రీకాంత్ గౌడ్, కుక్కదువ్వు ఉపేందర్, బండి మహేష్‌గౌడ్, మల్లేష్, శాంతచారి, నర్సింహ, శ్రీనివాస్, పాండు పాల్గొన్నారు.

నిరుపయోగంగా ప్రయాణికుల ప్రాంగణం



బస్టాండ్ ప్రాంగణంలో పెరిగిన కంపచెట్లు

రామన్నపేట : దివంగత మాజీ జెడ్పీటీసీ వేమవరపు మనోహర్ పంతులు మండలంలోని జనంపల్లిలో బాలికల గురుకుల పాఠశాల వద్ద 2016లో గ్రామస్తుల సౌకర్యార్థం ప్రయాణికుల ప్రాంగణాన్ని సుమారు రూ.3లక్షలతో నిర్మించారు. ప్రస్తుతం ప్రయాణికుల ప్రాంగణం కంపచెట్లతో మూసుకుపోయి నిరుపయోగంగా మారింది. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు స్పందించి కంపచెట్లను తొలగించి వినియోగంలోకి తీసుకురావాలని పలువురు గ్రామస్తులు కోరుతున్నారు.

రమణేశ్వరంలో దశభైరవుల విగ్రహ ప్రతిష్ఠ



పూజలు చేస్తున్న శ్రీరామణానంద మహర్షి

భువనగిరి రూరల్ : మండలంలోని నాగిరెడ్డిపల్లి రమణేశ్వరంలో సిద్ధగురు రామణానంద మహర్షి ఆధ్వర్యంలో శనివారం 18తాంత్రిక గురువుల దశభైరవుల శివలింగాల ప్రతిష్ఠను ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. డిసెంబర్ 2నుంచి 8వరకు విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. శనివారం మొదటిరోజున గోపూజ, దీపారాధన, గణపతి పూజతో ప్రారంభించి పుణ్యావచనం గావించారు. అనంతరం నిర్వాహకులు భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నిర్వాహకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.


మట్టపల్లి క్షేత్రంలో నారసింహుడి కల్యాణం



స్వామివారిని ఊరేగిస్తున్న అర్చకులు, భక్తులు

మఠంపల్లి: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన మట్టపల్లి క్షేత్రంలో శనివారం శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి నిత్యకల్యాణాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాత సేవ, ప్రత్యేకార్చనలు, మూల విరాట్‌మూర్తికి, పంచామృతాభిషేకం చేపట్టారు. అనంతరం శ్రీస్వామి, శ్రీరాజ్యలక్ష్మీచెంచులక్ష్మీ అమ్మవార్లను నూతన పట్టు వస్త్రాలతో వధూవరులుగా అలంకరించి ఎదుర్కోలు మహోత్సవం జరిపారు. ఆ తర్వాత విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం, పంచగవ్యప్రాశన, మధుపర్కపూజ, మాంగళ్యధారణ, తలంబ్రాలతో నిత్యకల్యాణం వైభవంగా నిర్వహించారు. నీరాజన మంత్రపుష్పాలతో మహానివేదన గావించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్, పాలకమండలి సభ్యులు కె.వెంకటనారాయణ, కొండల్‌రెడ్డి, అర్చకులు, శ్రీనివాసాచార్యులు, పద్మనాభాచార్యులు, బదరీనారాయణాచార్యులు, దుర్గాప్రసాద్‌శర్మ, లక్ష్మీనరసింహమూర్తి, ఫణిభూషణ మంగాచార్యులు, ఆంజనేయాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఫలితాలపై సర్వత్రా ఉత్కంఠ



తిరుమలగిరి (తుంగతుర్తి) : తుంగతుర్తి శాసనసభ తుది ఘట్టమైన ఓట్ల లెక్కింపు ఆదివారం ఉదయం 8 గంటలకు సూర్యాపేట జిల్లా కేంద్రంలోని మార్కెట్ గోదాంలో ప్రారంభమవుతుంది. ఓట్లు లెక్కించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం ఏర్పాట్లు చేసింది. ఈవీఎం కంట్రోల్ యూనిట్లలో నిక్షిప్తమై ఎవ్వరికి అధికారం కట్టబెడతాయోననే ఉత్కంఠ సర్వత్రా నెలకొన్నది.

87.64 శాతం పోలింగ్

తుంగతుర్తి నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2.55 లక్షల 17 మంది ఉండగా 2.23 లక్షల 496 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఓట్ల లెక్కింపు కోసం 18 కౌంటింగ్ టేబుళ్లను ఏర్పాటు చేశారు. 326 పోలింగ్ కేంద్రాలకు 19రౌండ్లలో ఓట్ల లెక్కింపు పూర్తి కానున్నది. ఒక్కో రౌండ్ 20 నుంచి 30 నిమిషాల్లో లెక్కింపు పూర్తవుతుంది. ఇప్పటికే ఓట్ల లెక్కింపుపై సిబ్బందికి శిక్షణ ఇచ్చారు.

పోస్టల్ బ్యాలెట్లతో మొదలు

ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్ ఓట్లతో లెక్కింపు ప్రారంభమై అర గంటలో ముగుస్తుంది. తొలుత పోస్టల్ బ్యాలెట్‌లో, తరువాత సర్వీస్ ఓట్లును లెక్కించాల్సి వస్తుంది. నియోజకవర్గంలో పోస్టల్ బ్యాలెట్ల 1,730 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. సంబంధిత రిటర్నింగ్ అధికారి పర్యవేక్షణలోనే పోస్టల్ బ్యాలెట్లను లెక్కిస్తారు. ఈవీఎంలలోని ఓట్ల లెక్కింపు టేబుళ్లను అదనంగా పోస్టల్ బ్యాలెట్ల కోసం ఆర్వో వద్ద ప్రత్యేక టేబుల్‌ను ఏర్పాటు చేస్తారు.

వీవీ ప్యాట్ స్లిప్పులే ప్రామాణికం

కంట్రోల్ యూనిట్లపై ఉన్న అనుమానాలను తొలగించడానికి నియోజకవర్గంలోని 5పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన వీవీ ప్యాట్ స్లిప్పులను లెక్కించాల్సి ఉంటుంది. ర్యాండమైజేషన్ పద్ధతి ద్వారా వీవీ ప్యాడ్లను ఎంపిక చేస్తారు. కంట్రోల్ యూనిట్లకు సంబంధించి చివరి రౌండ్ పూర్తయ్యాకే వీవీ ఫ్యాడ్ల స్లిప్పులను లెక్కిస్తారు. అభ్యర్థుల గుర్తుల వారిగా పెట్టెలను ఏర్పాటు చేసి వారికి వచ్చిన ఓట్లను వాటిల్లో వేస్తారు. అనంతరం లెక్కిస్తారు. ఒకవేళ ఈవీఎం కంట్రోల్ యూనిట్, వీవీప్యాట్ స్లిప్పులకు తేడా వస్తే ఆ స్లిప్పులను మరోసారి లెక్కిస్తారు.

రౌండ్ల వారీగా..

పోస్టల్ బ్యాలెట్లతో సంబంధం లేకుండా ఉదయం 8.30 గంటలకు ఈవీఎం కంట్రోల్ యూనిట్లలో నిక్షిప్తమైన ఓట్లను లెక్కించడం ప్రారంభిస్తారు. ఒక్కో నియోజకవర్గానికి 18 టేబుళ్లను ఏర్పాటు చేస్తారు. పోలింగ్ కేంద్రాల క్రమ సంఖ్య ఆధారంగా ఒక్కో టేబుల్‌కు ఒక్కో కంట్రోల్ యూనిట్‌ను కేటాయిస్తారు. ఇలా 18 టేబుళ్లపై 14 కంట్రోల్ యూనిట్లను ఉంచి ఓట్లను లెక్కిస్తారు. టేబుళ్లపై ఉన్న కంట్రోల్ యూనిట్లలోని ఓట్ల లెక్కింపు పూర్తయితే దానిని ఒక రౌండ్‌గా భావిస్తారు. ఈ ప్రక్రియ జరగడానికి సుమారు 20 నుంచి 30 నిమిషాల సమయం పడుతుంది. అధికారులు నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన కంట్రోల్ యూనిట్లలో ఓట్లను లెక్కించే వరకు రౌండ్ల వారిగా ఈ ప్రక్రియ కొనసాగుతుంది. కౌంటింగ్, అధికారులు, అభ్యర్థుల తరఫున వచ్చిన ఏజెంట్ల సమక్షంలో ఈ తంతు జరుగుతుంది.

ఉత్సవాలను విజయవంతం చేయాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న శ్రీశ్రీ కళా వేదిక సభ్యులు

భానుపురి (సూర్యాపేట): శ్రీశ్రీ కళా వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 16 ,17 తేదీల్లో పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం బుద్ధల కన్వెన్షన్ హాల్లో నిర్వహించే తెలుగు సాహిత్య కళా ఉత్సవాలను విజయవంతం చేయాలని మనం వికాస్ వేదిక అధ్యక్షుడు పెద్దిరెడ్డి గణేష్ పిలుపునిచ్చారు. శనివారం సూర్యాపేట పట్టణంలోని సుధా బ్యాంకు ఆడిటోరియంలో ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో శ్రీశ్రీ కళావేదిక అధ్యక్షుడు పోతుగంటి వీరాచారి, కవి రచయిత హమీద్ ఖాన్, సింగర్ దాచేపల్లి లక్ష్మి, ప్రముఖ కార్టూనిస్టులు మణిబాబు, ఆనంద్, వెంకన్న పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు విద్యార్థిని ఎంపిక



బొలగాని భవ్య

సూర్యాపేట రూరల్: ఆసిఫాబాద్‌లో నిర్వహించే తెలంగాణ రాష్ట్ర అండర్–14 ఖోఖో టోర్నమెంట్‌కు సూర్యాపేట మండలం బాలెంల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని బొలగాని భవ్య ఎంపికైనట్లు ఆ పాఠశాల హెచ్‌ఎం జెల్లా ప్రసాద్ తెలిపారు. శనివారం పాఠశాలలో శివరాత్రి భిక్షపతి జ్ఞాపకార్థం శివరాత్రి శేఖర్ సౌజన్యంతో నిర్వహించిన ఖోఖో పోటీల్లో ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయిలో ఆడేందుకు ఉమ్మడి జిల్లా జట్టుకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఆమె ఎంపిక పట్ల పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందలు తెలిపారు.

ఎంపీడీఓ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ మృతి

తిరుమలగిరి (తుంగతుర్తి) : తిరుమలగిరి మండల పరిషత్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న నాగెళ్ల శ్రవణ్‌కుమార్ (52) అనారోగ్యంతో శుక్రవారం రాత్రి మృతిచెందాడు. శ్రవణ్‌కుమార్ మృతి పట్ల ఎంపీపీ నెమురుగొమ్ముల స్నేహలత, మండల పరిషత్ అధికారి ఉమేష్‌చారి, మండల పంచాయతీ అధికారి మారయ్య, కార్యాలయం సిబ్బంది రణధీర్‌రెడ్డి, శిల్పిక నివాళులర్పించారు.

● ముమ్మరంగా వరిసాగు పనులు



వరినాట్లు వేస్తున్న మహిళలు

అడ్డగూడూరు : మండలంలో వరిసాగు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. యాసంగి సాగుకు రైతులు ఇప్పటికే నాట్లు వేసేందుకు వరినారును సిద్ధం చేశారు. మండలంలోని లక్ష్మీదేవికాల్వ, ధర్మారం, డి.రేపాక, కోటమర్తి, జానకిపురం, చిన్నపడిశాల గ్రామాలతో పాటు వివిధ గ్రామాల్లో రైతులు పొలాలను దమ్ము చేసే, నాట్లు వేసే పని నమగ్నమయ్యారు. మూసీ, బిక్కేరు వాగు ప్రాంత గ్రామాల్లో ఇప్పటికే నాట్లు వేసే పనులు ప్రారంభించారు.







యాసంగి సాగు పనుల్లో పాల్గొన్న రైతులు